క్లుప్తంగా

తహసీల్దార్‌గా సునీల్‌కుమార్


సునీల్ కుమార్

కాసిపేట: తహసీల్దార్‌గా సునీల్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన భోజన్న నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సునీల్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు అనంతరం ఆయన్ను సిబ్బంది, స్థానిక నాయకులు సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ అంజయ్య, ఎంఆర్‌ఐ కమల, నాయకులు గోలేటి స్వామి, దేవేందర్, రాజేష్ ఉన్నారు.

టీజీబీ మేనేజర్‌గా శిరీష


శిరీష

జన్నారం: మండలంలోని కలమడుగు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా శిరీష శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన మోహన్‌రెడ్డి బదిలీపై కుభీర్ మండలానికి వెళ్లగా, ఇందన్‌పల్లి బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శిరీష పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కుట్ర


మాట్లాడుతున్న నాయకులు

జన్నారం: లంబాడాలపై కుట్ర చేస్తూ వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కాంగ్రెస్ నాయకుడు సోయం బాపురావు సుప్రీం కోర్టుకు వెళ్లడం మూర్ఖపు చర్య అని లంబాడి జాగృతి సమితి మండల అధ్యక్షుడు బానవత్ సంతోష్ నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన నాయకులతో కలిసి మాట్లాడారు. ఎన్నికలు వస్తేనే మీ స్వార్థం కోసం లంబాడాలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వెంకట్రావ్, సోయం బాపురావుపై కాంగ్రెస్ చర్యలు తీసుకోవాలని లేకపోతే 60 లక్షల మంది లంబాడాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. సమావేశంలో రాములు నాయక్, సంతోష్ నాయక్, రాజు నాయక్, పవర్ దినేష్, మాలవత్ ప్రేమ్ సింగ్, శ్రీనివాస్, సాయికిరణ్, దేవిదాస్ నాయక్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

నిలిచిన నీరు తొలగింపు


నీళ్లు తొలగించి, క్రషర్ దుబ్బ చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండల కేంద్రంలోని గిరిజన ఉప కార్యనిర్వహణ ఇంజినీర్ కార్యాలయం ఎదుట వర్షపు నీరు నిలిచి అధ్వానంగా మారింది. ఈనెల 5న సాక్షిలో ప్రభుత్వ కార్యాలయం ముందే ఇలా! శీర్షికన ప్రచురితమైన కథనాన్ని పంచాయతీ అధికారులు స్పందించారు. నిలిచిన వర్షపు నీటిని శనివారం సిబ్బందితో తొలగించి, బురద కాకుండా క్రషర్ దుబ్బను చల్లారు. పైగా దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

బెల్లంపల్లిలో వందేభారత్ రైలు ఆపాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో వందేభారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌కు ఆదేశాలు జారీ చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి కార్మికుల పెన్షన్ పెంపు, కోల్‌బెల్ట్ ప్రాంతంలోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల, రైల్వేస్టేషన్లలో సౌకర్యాల కల్పన, రైతుల పక్షాన యూరియా సరఫరా కోసం పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో గళమెత్తడం అభినందనీయమన్నారు. తాజాగా మంచిర్యాల, కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు ఎంపీ ఆదేశాలు జారీ చేయించారన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, మాజీ వైస్ చైర్మన్ జి.రాజలింగు, కాంగ్రెస్ నాయకులు జి.జయరాం, కె.సతీశ్, రోడ్డ శ్యామ్, జావిద్ ఖాన్, ఓసియార్, పూర్ణచందర్, మంగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిండాముంచిన వరదలు

- వేలాది ఎకరాల పంట నీటిపాలు
- ప్రభుత్వంపైనే రైతుల ఆశలు



ఈ చిత్రంలో ఉన్నది నీలం శ్రీనివాస్. ఇతనికి చెన్నూర్‌లోని కోనంపేట శివారులో ఏడెకరాల పత్తి చేను ఉంది. ఈ ఏడాది రూ.1.60 లక్షల అప్పు చేసి పత్తి సాగు చేయగా మొలక ఏపుగా పెరిగింది. ఇప్పటికే రెండు సార్లు పిచికారి చేశాడు. ఇంకోసారి చేస్తే పంట చేతికందేది. తొలుత కురిసిన వర్షాలకు పంట ఎదుగుదల బాగుండే. ఇటీవల కురిసిన వానకు వరద పాలైంది. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరాడు.


చెన్నూర్ మండలం సుందరశాలలో పూర్తిగా దెబ్బతిన్న పత్తి

పంట నష్టం ప్రాథమిక అంచనా..

మండలం	రైతులు	ఎకరాలు
చెన్నూర్	894	2270
కోటపల్లి	522	1035
జైపూర్	1327	2725
మందమర్రి	23	18

ప్రభుత్వం ఆదుకోవాలి



గతేడాది పత్తి ధర బాగుండడంతో ఈ ఏడాది లక్ష రూపాయలు ఖర్చు చేసి ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. నెల రోజులైతే పంట చేతికి వస్తుందని ఆశపడ్డా. వరదలు నా ఆశలపై నీళ్లు చల్లాయి. ఎకరం పంట మిగులకుండా పూర్తిగా నీళ్ల పాలైంది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– మహేశ్, రైతు, చెన్నూర్

పంట నష్టంపై సర్వే చేయాలి



ఏటా అకాల వర్షాలు, వరదలకు పంట నష్టపోతున్నా. ఈసారైన కాలం కలిసి వస్తుందని ఆశపడ్డా. ఈ ఏడాది నాలుగెకరాలు పత్తి సాగు చేశా. భారీ వర్షాలకు పంట నీట మునిగింది. రూ.90 వేల నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు పంట నష్టంపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించాలి.
– కమలాకర్, రైతు, రాంపూర్, మం.కోటపల్లి

చెన్నూర్: ప్రకృతి వైపరీత్యాలతో ప్రతీఏటా రైతులు నష్టపోతున్నారు. గత నాలుగేళ్లపాటు కాళేశ్వరం బ్యాక్‌వాటర్ కారణంగా పంటలు నష్టపోగా, ఈ ఏడాది గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో పరీవాహక ప్రాంత పంట చేన్లు వరద పాలయ్యాయి. లక్షల రూపాయలు అప్పులు చేసి పంట సాగు చేసిన అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. గత వారం పాటు జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా చెన్నూర్, కోటపల్లి, జైపూర్ మందమర్రి మండలాల్లో సుమారు 2,766 మంది రైతులకు చెందిన 6,048 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

కొనసాగుతున్న సర్వే

నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, జైపూర్, మందమర్రి మండలాల్లో భారీ వర్షాలకు పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. ఏవోలు, ఏఈవోలు చేస్తున్న సర్వే కొనసాగుతోంది. సర్వే పూర్తయితే ఎంత నష్టం జరిగింది వివరాలు వెల్లడవుతాయని, మరో మూడు రోజుల్లో సర్వే పూర్తవుతుందని ఏవోలు పేర్కొంటున్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ


జీఎం రాధాకృష్ణను సన్మానిస్తున్న అధికారులు

కాసిపేట: సింగరేణి ఉద్యోగులు, కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ తెలిపారు. కాసిపేట 2గనిని శనివారం సందర్శించి అండర్‌గ్రౌండ్ పని స్థలాలు, పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటారన్నారు. సూపర్‌వైజర్లు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు గ్రూప్ ఏజెంట్ రాంబాబు, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, అధికారులు ఆయన్ను సన్మానించారు. ఏరియా ఇంజినీర్ రాంప్రసాద్, రక్షణాధికారి రవి శంకర్, సంక్షేమాధికారి భార్గవ్, ఏఐటీయూసీ నాయకులు నర్సయ్య, వెంకటేశ్, కృష్ణచారి తదితరులు ఉన్నారు.

స్టడీ టూర్‌కు ఐఎన్టీయూసీ నేతలు

శ్రీరాంపూర్: కంపెనీ ఆధ్వర్యంలో వెళ్తున్న స్టడీ టూర్‌కు సింగరేణి నుంచి ఐఎన్టీయూసీకి చెందిన నలుగురు నాయకులు వెళ్తున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు. కేంద్ర కమిటీ నాయకులు సి.త్యాగరాజన్, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, ఎండీ అక్రమ్‌లు ఒడిశా రాష్ట్రంలోని మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ సంస్థ గనులను ఈనెల 8, 9 తేదీల్లో పరిశీలించేందుకు వెళ్తున్నారు. తమకు అవకాశం కల్పించిన యూనియన్ సెక్రెటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్‌ను రసూల్‌పల్లిలోని ఆయన నివాసంలో నేతలు సన్మానించారు.

ప్రమాదాలపై తప్పుడు రిపోర్టులు

శ్రీరాంపూర్: అధికారులు తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి తప్పుడు ప్రమాద రిపోర్టులు రాస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఎస్సార్పీ 3 గనిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో కె.రాజేష్ అనే కార్మికుడికి చేతి విరిగింది. రామకృష్ణపూర్‌లోని ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను శనివారం యూనియన్ నాయకులు కలిసి పరామర్శించారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య మాట్లాడుతూ టబ్బు తాడు తాకడంతో కార్మికుడి చేయి విరిగిందని తెలిపారు. రక్షణ అధికారి పని వద్ద ఉండగా గులాయిలో లైన్ రిపోర్ట్ ఉందని కార్మికులు చెప్పిన పట్టించుకోకుండా సదరు కార్మికుడితో పనిచేయించడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అతడు నడుచుకుంటూ వెళ్తూ జారిపడ్డాడని తప్పుడు రిపోర్ట్ రాశారన్నారు. అధికారులు ఈ విధానం మార్చుకోవాలని హెచ్చరించారు. యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్ ఆలీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీ సైదా ఉపాధ్యాయుడు కొట్టే కిషన్‌రావు నాయకులు సంపత్, బద్రి బుచ్చయ్య, గునిగంటి నర్సింగరావు, సురేశ్, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చాలి

జైపూర్: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఇందారం ఐకే 1ఏ గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా సింగరేణి కార్మికులు సొంతింటి కోసం పోరాటం చేస్తున్నప్పటికి గుర్తింపు సంఘంగా ఎన్నికైన యూనియన్లు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటం చేస్తామని, ఇందులో భాగంగా సొంతింటి కల సాకారం కోసం పోస్టర్లు ఆవిష్కరించినట్లుగా తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు గుర్తింపుతోనే టీబీ నివారణ


అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్

నెన్నెల: టీబీని ముందస్తుగా గుర్తించి చికిత్స చేస్తేనే వ్యాధిని నివారించడం సాధ్యమవుతుందని మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్‌లో భాగంగా గొల్లపల్లిలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి 50 మందికి తెమడ, రక్త, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, మాట్లాడేటప్పుడు గాలి ద్వారా వ్యాపిస్తుందన్నారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, బరువు తగ్గడంలాంటి లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయ సంబంధిత ఉచిత నిర్ధారణ పరీక్షలు, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. వ్యాధి సోకిన రోగులకు పౌష్టికాహారం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ప్రతినెల రూ.వెయ్యి ఆర్థికసాయం అందిస్తుందన్నారు. టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, సుశీల, హెల్త్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు శ్రావణి, కావ్య, సంధ్య, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది రుక్మిణి, ఏఎన్‌ఎం స్వప్న, గంగ, చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నష్టపోయిన పంటలు పరిశీలన


పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో, ఏఈవోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేంపల్లిలో శనివారం భారీ వర్షాలతో నష్టపోయిన ప్రాంతాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. మంచిర్యాల డివిజన్ ఏడీఏ మామిడి కృష్ణ ఆధ్వర్యంలో ఏవో కృష్ణ, ఏఈవోలు కొమురయ్య, మౌనిక, ప్రసన్న.. రైతుల వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లారు. పంట నష్టాన్ని అంచనా వేశారు. ముల్కల్ల రైతువేదికలో సమావేశమై ఏవో, ఏఈవోలకు రైతు రిజిస్ట్రీ, పంట విస్తీర్ణం, సాగు, క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్ తదితర వివరాలన్నీ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పంట నష్టం నివేదిక తయారు చేశారు.

వయోవృద్ధుల కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వయో వృద్ధుల సంరక్షణ, సంక్షేమంపై కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసులు మానిటరింగ్ సిస్టమ్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా/మీసేవ కేంద్రాల ద్వారా నమోదు చేయాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో ఈ విధానాన్ని ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు.

మండలానికి యూరియా కేటాయించండి

వేమనపల్లి: మండలానికి యూరియా కేటాయించాలని మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్.. 2 వేల యూరియా బస్తాలు మండలానికి కేటాయించాలని జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించారు. కన్నెపల్లి, భీమిని మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, నాయకులు నర్సింగరావు, హరీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర మహాసభ

పాతమంచిర్యాల: తెలంగాణ బేవరేజస్ హమాలీ వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభను జిల్లా కేంద్రంలోని హరిత ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర హమాలీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు, బేవరేజస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లన్న, కార్యదర్శి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఫారెస్ట్‌లో నేరాల నియంత్రణకు డాగ్ స్క్వాడ్

భీమారం: రిజర్వు ఫారెస్ట్‌లో జరిగే నేరాల నియంత్రణ కోసం అటవీశాఖ కొత్తగా డాగ్ స్క్వాడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జైపూర్ ఏఎఫ్ఎస్‌వో రామకృష్ణ సర్కార్ తెలిపారు. ఆరెపల్లిలో డాగ్ స్క్వాడ్‌పై శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అడవుల్లో చెట్లు నరికినా, విద్యుత్ తీగలు పెట్టి జంతువులను చంపిన నేరస్తులను గుర్తిస్తాయని తెలిపారు. కాగా, దాంపూర్, రెడ్డిపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సిబ్బంది దీక్ష, సతీశ్, అనిల్ పాల్గొన్నారు.

మందకృష్ణకు సన్మానం

తాండూర్: మండలంలోని మహాగర్జన సన్నాహక సదస్సుకు హాజరైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణను శనివారం బీజేపీ నాయకులు సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, నాయకులు ఆయనకు శాలువాలు కప్పి మెమెంటో అందజేసి సత్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రామగోని మహీధర్‌గౌడ్, నాయకులు పులుగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, శనిగరపు శ్రావణ్, పుట్ట కుమార్, సంగీత, గోవర్దన్ తదితరులు ఉన్నారు.

దోమల మందు పిచికారీ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, హాస్టల్‌లో వెంకట్రావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వల్ల విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ముందుస్తు జాగ్రత్తగ దోమల మందును పిచికారీ చేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. వైద్యాధికారి సతీష్‌కుమార్, శ్రీనివాస్, స్వామి, ఇసాక్, గఫూర్ పాల్గొన్నారు.

పాత్రికేయులకు సన్మానం

తాండూర్: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పాత్రికేయులకు శనివారం శాలువాలు కప్పి జ్ఞాపికలు, మొక్కలు అందజేసి సత్కరించారు. వాసవీక్లబ్ ప్రతినిధులు కె.సంతోష్‌కుమార్, మైలారపు మధుసూదన్, మణికృష్ణ, రాచకొండ మహేశ్, బోనగిరి చంద్రశేఖర్, కేశెట్టి సువర్ణ మాదవి, కల్పన, భాస్కర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

మందమర్రిరూరల్/కాసిపేట: మందమర్రి, కాసిపేట ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాను శనివారం ప్రదర్శించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీ వరకు మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. కాగా, జాబితాలపై అభ్యంతరాల స్వీకరణకు 8న రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు కాసిపేట ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తెలిపారు. ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

వెళ్లి రావయ్యా.. గణపయ్యా

- శోభాయాత్రలో యువకుల నృత్యాలు
- ఘనంగా వినాయక నిమజ్జనం


కాసిపేటలో నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడు


మంచిర్యాలలోని శ్రీనివాసకాలనీలో..


హాజీపూర్ మండలం ముల్కల్లలో..


వేమనపల్లిలో..


దండేపల్లిలో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/వేమనపల్లి/కాసిపేట/పాతమంచిర్యాల/లక్సెట్టిపేట: వినాయకచవితి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా భక్తులతో విశేష పూజలందుకున్న గణపయ్యకు వీడ్కోలు పలికి గంగమ్మ ఒడికి చేరాడు. అంతకు ముందు మండపాల వద్ద గణనాథులకు పూజలు అనంతరం శోభాయాత్రగా నిమజ్జనానికి తరలివెళ్లాయి. డప్పుచప్పుళ్ల మధ్య మహిళల కోలాట ప్రదర్శనలు, యువతీ, యువకులు నృత్యాలు చేశారు. రెండో రోజు శనివారం హాజీపూర్, గుడిపేట, వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లోని ఉన్న 22 భారీ గణనాథుడి విగ్రహ నిమజ్జన శోభాయాత్ర కనుల పండవగా జరిగింది. ముల్కల్లలోని శివగణేశ్, భజరంగ్ యూత్, శివపార్వతి లంబోదర యూత్ గణేశ్ మండళ్ల ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకల్లో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాలను నిమజ్జనానికి గూడెం గోదావరికి తరలించారు. హాజీపూర్‌లోని యువ తెలంగాణ గణేశ్ మండలి ఆధ్వర్యంలో మెగా లక్కీ డ్రా నిర్వహించగా 2 గ్రాముల బంగారు లక్ష్మీ బిళ్లను స్థానిక ముస్లిం భక్తుడు ఎండీ అయాన్ గెలుచుకున్నాడు.

- దండేపల్లిలో శోభాయాత్రగా గణనాథులను ఊరేగించారు. అనంతరం విగ్రహాలను గూడెం గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.
- వేమనపల్లిలో గణేశుడిని శోభాయాత్ర నిర్వహించి ప్రాణహిత నదిలో నిమజ్జనం చేశారు. శివాలయం గణపతి వద్ద లడ్డూను వేలంలో రూ.13 వేలకు ప్రసన్న కుమార్, కలశాన్ని రూ.6,600లకు మద్దెర్ల సత్యనారాయణ, దోతిని రూ.4 వేలకు పర్వతపు వెంకన్న దక్కించుకున్నారు. వేమన యూత్ గణేశ్ మండలి వద్ద లక్కీ డ్రా పద్ధతిలో లడ్డూను మడె పున్నం, నీల్వాయిలో లడ్డూను రూ.12,016లకు కామెర చంద్రమౌళి, కలశాన్ని రూ.1516లకు రెబ్బెన సంతోష్ కుమార్, పట్టు వస్త్రాలను రూ.2,016లకు కామెర చంద్రమౌళి వేలంలో దక్కించుకున్నారు.
- కాసిపేటతోపాటు ముత్యంపల్లి, కోమటిచేను గ్రామాల్లో శనివారం సాయంత్రం వినాయకుల నిమజ్జనాన్ని నిర్వహించారు. మహిళలు, యువకులు నృత్యాలు చేస్తూ గణేశ్ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.
- జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో గణేశ్ నిమజ్జన శోభాయాత్రను సాయికృప గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు కోలాటాలు, నృత్యాలతో గణపతికి వీడ్కోలు పలికారు. అనంతరం గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.
- లక్సెట్టిపేట మండలంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఆంధ్రాకాలనీ గణేశ్ మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో సుధాకర్ రూ.53,116లకు దక్కించుకున్నారు. స్థానిక గోదావరి నదిలో వినాయక నిమజ్జనాలకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గణపయ్యలకు పూజలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెరబెల్లి శనివారం దర్శించుకుని, పూజలు చేశారు. రాంనగర్‌లోని వినాయక మండపాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


పాతమంచిర్యాల: సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/పాతమంచిర్యాల/చెన్నూర్‌రూరల్/భీమారం/మందమర్రిరూరల్: జిల్లాలోని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ముల్కల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులు రాజకుమారి(దుబ్బపల్లి), నర్సయ్య(దొనబండ), విశ్వప్రసాద్(రాపల్లి), శ్రీనివాసరెడ్డి(సబ్బేపల్లి), సయ్యద్ అలీముద్దీన్(ముల్కల్ల)ను ఎంఈఓ తిరుపతిరెడ్డి సన్మానించారు. సబ్బేపల్లి, దొనబండ కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలు సుధారాణి, కరుణాకర్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం రాజేశం పాల్గొన్నారు.

- జిల్లాకేంద్రంలో ఆవోపా రాష్ట్ర అదనపు కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్ నాయకులతో కలిసి 25 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు నేరేళ్ల శ్రీనివాస్, కార్యదర్శి రావి రమేశ్, కోశాధికారి దొడ్డ శ్రీనివాస్, నాయకులు పల్లెర్ల శ్రీహరి, సభ్యులు పాల్గొన్నారు.
- చెన్నూర్ మండలం అంగ్రాజ్‌పల్లిలోని వివేకానంద విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కరస్పాండెంట్ మణికండన్‌పే సన్మానించారు. హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- భీమారంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో గోపాల్‌రావు, ఉపాధ్యాయులు సన్మానించారు. అదేవిదంగా కేజీబీవీలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ప్రత్యేక అధికారి కనకలక్ష్మి పూలమాల వేశారు.
- మందమర్రి విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో దత్తుమూర్తి, ఎంపీడీవో రాజేశ్వర్ శనివారం మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసపత్రాలు అందజేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

'మాజీ కౌన్సిలర్‌పై దాడి హేయమైన చర్య'

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఈనెల 3న యూరియా కోసం రైతులు చేస్తున్న ధర్నాకు మద్దతు పలికిన మాజీ కౌన్సిలర్ దోమకొండ అనిల్‌పై సీఐ దాడి చేయడం హేయమైన చర్య అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లం లింగమూర్తి, రాష్ట్ర యువజన సంఘం రాష్ట్రకార్యదర్శి బండి సంజయ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారులపై ప్రభుత్వ ఒత్తిడి ఉన్నప్పటికీ దాడులు చేయడం సరికాదన్నారు. సీఐ భేషరతుగా అనిల్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో జైపూర్ మండల అధ్యక్షుడు చిద్దం సత్యనారాయణ, నాయకులు విద్యాసాగర్, శ్రీనివాస్, మహదేవ్, చెన్నూర్, కోటపల్లి, జైపూర్ మండలాల కాపు నాయకులు పాల్గొన్నారు.